


PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 19 | బుధవారం 22, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari






## ఏపీ వక్ఫ్ బోర్డ్

# కీలక నిర్ణయం

## విద్యార్థులకు మరో విద్యా పథకం

విజయవాడ, ఏప్రిల్ 21 : ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 14వ వక్ఫ్ బోర్డ్ సమావేశం ఈరోజు (మంగళవారం) జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆయా అజెండాలపై ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు. ఈ మేరకు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ విద్య ఖర్చులను వక్ఫ్ బోర్డ్ భరిస్తుందని తెలిపారు. 'తాలీం ఏ హునర్' పేరుతో వక్ఫ్ బోర్డు ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు నడుపుతోందని.. అదే

2లో

## వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు





- రాజకీయ హత్యలకు డెన్‌గా మారింది
- పార్టీ అనుమతులపై ఇసి ఆలోచన చేయాలి
- దస్తగిరి హత్యతో వైసిపి నైజం మరింత బయటపడింది
- మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు

అమరావతి ఏప్రిల్ 21 : వైసీపీ రాజకీయ పార్టీ కాదని.. హత్య రాజకీయాలకు డెన్‌గా తయారైందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత వైసీపీకి లేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అనుమతులపైన ఎలక్షన్ కమిషన్ కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టు కొని దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పార్టీ చేసిందని విమర్శించారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. చీకట్లో చంపడం.. పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువ చేసే డాక్యుమెం ట్లు దొరికాయని మంత్రి కొలుసు పార్థసారథి

2లో

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

- ఉపాధి హామీని మరింతగా విస్తరించాలి
- ఎక్స్ వేదికగా జగన్ పోస్ట్



అమరావతి, ఏప్రిల్ 21 : గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ మద్దతు క్రమంగా తగ్గిపోతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. గ్రామీణ ప్రజలకు కీలకంగా ఉపయోగపడేజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం సమర్థవంతంగా అమలు కావడం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల చేతిలో ఖర్చు చేయగలిగే ఆదాయం పెరుగుతుందని, దాంతో గ్రామీణ మార్కెట్లలో వినియోగం పెరిగి ఆర్థిక చలనం వస్తుందని వివరించారు. ఎక్కువగా ఖర్చు చేసే వర్గాల చేతిలో డబ్బు ఉంటే గ్రామీణ ఆదాయ వినియోగం పెరుగుతుందని, అది మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని అన్నారు వైఎస్ జగన్. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంజీఎన్ఆర్ఈజీఏ అమలులో దేశవ్యాప్తంగా

2లో

## తమిళ భవిష్యత్ కోసం

# ఎన్‌డిఎకు ఓటేయండి

- పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి
- మోడీ నేతృతత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం
- ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం







చెన్నై, ఏప్రిల్ 21 :తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని.. చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఎ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక

2లో

## తమిళనాడు తీరప్రాంతానికి

# వర్ష హెచ్చరిక

చెన్నై,ఏప్రిల్21 : తమిళనాడు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల తీరప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు చెన్నై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ఉత్తర కర్ణాటక నుంచి రాష్ట్రం మీదుగా మన్నార్‌వలైకుడ వరకు ఉపరితల ఆవర్తనం నెలకొంది. ఈ కారణం గా, పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాలు, దక్షిణ జిల్లాల సముద్రీతీరప్రాంతాల్లో

2లో

## మచిలీపట్నంలో ఆస్పత్రిలో

# మంత్రి తనిఖీలు

- పారిశుద్ధ్యం, పార్కింగ్ వ్యవస్థల మెరుగుకు ఆదేశం



మచిలీపట్నం, )ఏప్రిల్ 21 :మచిలీపట్నం సర్వజన ప్రభుత్వాస్పత్రిలో మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం బైకుపై వచ్చి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పార్కింగ్ చేయకుండా అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలను చూసి సెక్యూరిటీ విభాగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్లుగా

2లో

## బాణాసంచా

# తయారీ కేంద్రంలో పేలుడు

- ఆరుగురు మృతి..40 మందికి గాయాలు



తిరువనంతపురం, ఏప్రిల్ 21 : తమిళనాడు విరుదునగర్‌లోని బాణసంచాలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువక ముందే.. కేరళలో మరో విషాదం నెలకొంది. త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందారు. మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. త్రిస్సూర్ తిరువంబడిలోని ఓ బాణసంచా తయారీ యూనిట్లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 24న జరగాల్సిన నమూనా బాణసంచా కోసం ఆ కేంద్రంలో సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఆ శబ్దం సుమారు కొన్ని కిలోమీటర్ల మేర వినిపించినట్టు స్థానికులు తెలిపారు. తొలుత దీన్ని భూప్రకంపనలు గా భావించినట్టు వారు తెలిపారు. పేలుడు అనంతరం ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అయితే.. నల్లటి పొగలు, మరోసారి పేలుడు సంభవించిన కారణంగా సహాయక చర్యలు కష్టతరంగా మారాయని అక్కడి అధికారులు వెల్లడించారు.

# సంపాదకీయం

## వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది.వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్దతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్దం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్ష్యం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకలు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప- అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఎపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

## ఏపీ వక్ఫ్ బోర్డ్ కీలక నిర్ణయం

పేరుతో ఈ విద్యా పథకం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం 500 మందికి ఉచిత ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ విద్యను అమలు చేస్తామని వెల్లడించారు. రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ విద్యతో పాటు జేఈఈ మెయిన్స్, నీట్ కోసం ఉచిత శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. మొదటి ఏడాది 250 మందితో ఈ పథకాన్ని ప్రారంభిస్తామని.. రెండో ఏడాది నుంచి ఏటా 500 మందికి ఉచిత విద్య అందజేస్తామని తెలిపారు. ట్యాలెంట్ టెస్ట్ ద్వారా ముస్లిం విద్యార్థులను ఎంపిక చేస్తామని అన్నారు.

## మచిలీపట్నంలో ఆస్పత్రిలో మంత్రి తనిఖీలు

వాహనాలు పార్కింగ్ చేస్తుంటే సిబ్బంది ఏం చేస్తున్నారని మందలించారు. అనంతరం పలు విభాగాల్లో తనిఖీలు చేశారు. అలాగే, ఓపీ రిజిస్ట్రేషన్లను పరిశీలించి.. ఓపీలో చాలామంది రోగులు వేచి ఉండటంపై మంత్రి ఆరా తీశారు. కౌంటర్ల సంఖ్యను పెంచాలని సూపరింటెండెంట్‌కు మంత్రి ఆదేశించారు. ఓపీలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. రక్తనమూనా పరీక్షల విభాగం, ఎక్సరే విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి వైద్యులతో సమావేశమై వైద్య సేవల గురించి చర్చించారు. పారిశుద్ధ్య, పార్కింగ్ వ్యవస్థను మెరుగుపర్చాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

అగ్రగామిరాష్ట్రంగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు.అయితే, గత రెండేళ్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనితీరు తీవ్రంగా పడిపోయిందని జగన్ విమర్శించారు. లేబర్ బ్జడెట్, పని చేసిన కుటుంబాల సంఖ్య, ఖర్చు చేసిన నిధులు వంటి అన్ని అంశాల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఆరోపించారు.గత రెండేళ్లలో జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ వృద్ధి రేట్లు కూడా తగ్గాయని జగన్ తెలిపారు. ఇది ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందనే సంకేతమని అన్నారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోవడంతో డిమాండ్ పడిపోతుందని, దాని ప్రభావం వ్యాపార రంగంపై కూడా పడుతోందని చెప్పారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విఫలమవుతోందని దుయ్యబట్టారు.. అవినీతి ఆరోపణలు, సంపద కూడబెట్టాలనే అధిక ఆశలతో ప్రభుత్వం దారి తప్పుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదని మాజీ సీఎం జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## తమిళనాడు తీరప్రాంతానికి వర్ష హెచ్చరిక

మంగళ, బుధవారా ల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. తూణరాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. రాష్ట్రంలోని అంతర్ జిల్లాల్లో ఈ నెల 23వ తేది వరకు ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ గరిష్ట ఉష్ణోగ్రత 37 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియ్‌సగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు

ప్రస్తావించారు. జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు, హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో ఎలా లభించాయని ప్రశ్నించారు. హత్యకు గురైన పెద్ద దస్తగిరి.. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్యుడని చెప్పుకొచ్చారు. ఆస్తులు, అధికారం కోసం వైసీపీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి, పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకమాడుతోందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు ప్రధాన కారకులైన వారు.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వైసీపీని ఒక రాజకీయ పార్టీగా ప్రజలు చూడటం లేదని.. రాజకీయాల్లో కొనసాగే అర్హత ఆ పార్టీకి లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ధనదాహం, అధికారదాహానికి ఎవరు అడ్డొచ్చినా తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు. పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్ధాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి సూచించారు.

## తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి

వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్టక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగాఓటువేయాలి.డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశంఉంది.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది.ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది.




## పిఆర్సి సాధనకై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

### - కడప ఫ్యాప్టో చైర్మన్ సంగమేశ్వర రెడ్డి

వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: 12వ పిఆర్సి సాధనకై ప్రభుత్వంపై ఉమ్మడి ఉద్యమాల ద్వారా ఒత్తిడి తెస్తామని కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్ నర్రెడ్డి సంగమేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఉద్యమాల ద్వారానే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని, దీనిలో భాగంగా 9 ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో మలిదశ ఉద్యమానికి పిలుపు ఇచ్చామన్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీని కోసం కడప జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన సవరణ, డీఏ చెల్లింపు తదితర అంశాలపై తీవ్ర అలసత్వాన్ని వహిస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. గత ఏడేళ్ల నుంచి ఉపాధ్యాయులకు జీతం తప్ప ఇతర ఆర్థికపరమైన సహకారం అందడం లేదన్నారు. 12వ పిఆర్సి తీవ్ర ఆలస్యం వల్ల తీరని ఆర్థిక నష్టాన్ని మిగిలిస్తుందన్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూల ఆలోచనతో చర్చలకు పిలవాలని, పిఆర్సి కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, ప్రాంతీయ కన్వీనర్ ప్రతాపరెడ్డి, డిసి గోవిందు, భాస్కర్ రెడ్డి, కుళాయి బాబు, అశోక్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవు

### - ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సీఐ గురునాథ్ అవగాహన



మదనపల్లె (ప్రజా సీమ) : ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పక పాటించాలని మదనపల్లె ట్రాఫిక్ సీఐ గురునాథ్ పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని హోప్ హైస్కూల్ ఎదురుగా ఆటో డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా ఆటో డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని,రికార్డులు కలిగి ఉండాలని,తప్పకుండా యూనిఫామ్ ధరించాలని సూచించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని,సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని,ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపకూడదని,ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు.అదేవిధంగా రికార్డులు సక్రమంగా లేని ఆటోలకు జరిమానాలు విధించడం జరిగిందన్నారు.నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు,జరిమానాలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మిట్స్ విద్యార్థులకు హెచ్.డి.ఎఫ్.సి పరివర్తన్ స్కాలర్షిప్స్

### - ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి హర్షం




కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు ఎం.సి.ఏ మొదటి మరియు రెండవ సంవత్సరం చదువుతున్న 7 మంది విద్యార్థులకు హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ పరివర్తన్ యొక్క ఈసీఎస్ఎస్ ప్రోగ్రామ్ (మెరిట్-కమ్-నీడ్ బేస్డ్) స్కాలర్షిప్స్ అందజేసినట్లు వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు.ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం హెచ్.డి.ఎఫ్.సి వారు విద్యార్థుల మెరిట్ ను దృష్టిలో ఉంచుకొని ఈ స్కాలర్షిప్స్ అందజేసినట్లు ఆయన అన్నారు.స్కాలర్షిప్స్ పొందిన విద్యార్థులకు ఒక్కక్కరికి రూ.75,000 చొప్పున మొత్తం రూ.5,25,000 లక్షల స్కాలర్షిప్స్ అందజేసినట్లు ఆయన వెల్లడించారు.స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులను మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి,ప్రో-ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్ మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల,రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్,సీనియర్ మేనేజర్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సమీనా తదితరులు అభినందనలు తెలియజేశారు.

# కాంగ్రెస్ నేతలు రైల్వే కోడూరు విద్యార్థులకు ఘన సత్కారం

## దాసరి వర్షకు ఇంటర్లో స్టేట్ ఫస్ట్, శ్యాంరాజ్ కు సీబీఎస్ఈలో రాయలసీమ ఫస్ట్



ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు: సమతా నగర్ కు చెందిన దళిత నాయకుడు, ఆర్ఎంపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జయచంద్ర, విష్ణు శివ జ్యోతి దంపతుల పిల్లలు విద్యలో అద్భుత ప్రతిభ కనబరిచారు. వారి కుమార్తె దాసరి వర్ష 2026 ఇంటర్మీడియట్ పరీక్షలలో బైపీసీ విభాగంలో 1000 మార్కులకు 985 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ ర్యాంక్ పొందింది. కుమారుడు దాసరి శ్యాంరాజ్ సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్షలలో 500 మార్కులకు 487 మార్కులు సాధించి రాయలసీమ ప్రాంతంలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరి గాళ్ళ శాంతయ్య ఆధ్వర్యంలో పుల్లంపేట మండల అధ్యక్షుడు సిగమాల రమేష్, రైల్వేకోడూరు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ కాసల బాలమురళీకృష్ణ లు దాసరి జయచంద్ర నివాసానికి వెళ్లి విద్యార్థులను శాలువా, పూలమాలలతో సన్మానించి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. శాంతయ్య మాట్లాడుతూ.. "చదువుతోనే తలరాత మారుతుంది. ఒక పేదవాడి గౌరవాన్ని నిలబెట్టేది చదువు మాత్రమే. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయంగా దళితులు విద్యావంతులై ఆత్మగౌరవంతో ముందుకెళ్లాలి. వర్ష, శ్యాంరాజ్ సాధించిన ర్యాంకులు దళిత జాతికే గర్వకారణం" అని అన్నారు. వారి చదువుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులు, గురువులు, కళాశాల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు.

# కురవంక స్పెషల్ ఆఫీసరుగా తిరుపాల్ నాయక్ బాధ్యతలు

## - శుభాకాంక్షలు తెలిపిన కూటమి పార్టీల నేతలు



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లి మండలం,కురవంక పంచాయతీ ప్రత్యేక అధికారిగా తిరుపాల్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం పంచాయతీ టిడిపి ఇంచార్జి పసుపులేటి వినోద్ కుమార్,జనసేన పార్టీ ఇంచార్జి పసుపులేటి చంద్రశేఖర్,నాయకులు బెల్లె రెడ్డి ప్రసాద్,బెల్లె హారతి, సచివాలయ సిబ్బంది,పంచాయతీ సిబ్బంది ప్రత్యేక అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగియడంతో పంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే తిరుపాల్ నాయక్ ని కురవంక పంచాయతీ ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందన్నారు. ప్రస్తుతం డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న తిరుపాల్ నాయక్ సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అటువంటి అధికారిని కురవంకకు నియమించడం శుభపరిణామమన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు,పంచాయతీ అభివృద్ధికి ఆయన బాటలు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ప్రత్యేక అధికారి తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ స్థానిక నాయకుల సహకారంతో పంచాయతీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించి పరిష్కరించుకోవచ్చునని సూచించారు.

# డబుల్ ఇంజన్ సర్కార్, ట్రబుల్ ఇంజన్

## - సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం - డా.తులసిరెడ్డి



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్, ట్రబుల్ ఇంజన్ సర్కార్ లా తయారైందని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండడం వల్ల ఏపిలో మేలు జరిగిందని సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. ఆ విధంగా నిజమైతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంజీవిని అయిన ప్రత్యేకహోదా ఎందుకు అమలు కాలేదని సూటిగా ప్రశ్నించారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను పరిగణనలోకి ఎందుకు తీసుకోలేదని, వీటిని ఎందుకు అమలు చేయలేదని సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాగ్ నివేదిక ప్రకారం 2023-24 ఆర్థిక ఏడాదికి వైకాపా పాలనలో కేంద్రం నుండి రాష్ట్రానికి రూ.34,698 కోట్లు గ్రాంట్ రాగా, 2024-25 డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో కేవలం రూ.20135 కోట్లు మాత్రమే వచ్చిందన్నారు. దీంతో స్పష్టంగా డబుల్ ఇంజన్ సర్కార్, ట్రబుల్ ఇంజన్ సర్కార్, డొక్కు ఇంజన్ సర్కార్ లా తయారైందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

# శ్రీ ప్రత్యూష హై స్కూల్‌లో ఘనంగా 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలు





పుల్లంపేట (ప్రజా సీమ): స్థానిక శ్రీ ప్రత్యూష హై స్కూల్ ఆవరణలో 5వ తరగతి మరియు యూకేజీ విద్యార్థుల కోసం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే (పట్టభద్రుల దినోత్సవం) వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. చిన్నారులు తమ తొలి విద్యా మెట్టును విజయవంతంగా అధిరోహించి, ఉన్నత తరగతులకు వెళ్తున్న తరుణంలో ఈ కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరై విద్యార్థుల విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు. చిన్నారులు తమ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను పూర్తి చేసుకుని తదుపరి తరగతులకు అడుగుపెడుతున్న సందర్భంలో ఈ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. విద్యార్థులు సంప్రదాయ గౌన్లు మరియు క్యాప్స్ ధరించి స్టేజ్ పై గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. వారి ఆనందం, తల్లిదండ్రుల గర్వం కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "విద్యార్థుల అభివృద్ధి మా లక్ష్యం. ఈ చిన్న వయస్సులోనే వారు సాధించిన విజయాలు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయి" అని తెలిపారు. తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణకు మరియు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమం చివరలో విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, హెడ్మాస్టర్ సుబ్బ నరసింహులు, ఇన్చార్జులు రవి మరియు రాధ, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, మహబూబ్ బి, నీలవేణి, నందిని, బాబి, నిషిత, శ్రావణి మౌనిక మొదలగువారు పాల్గొన్నారు.

# ఆదిత్యలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సుపై అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం

## - హాజరైన తిరుపతి ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ యటూరు కాళిదాస్





మదనపల్లె (ప్రజా సీమ) : పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం,అనంతపురంలోని జేఎన్‌టీయూఏ అధ్యాపక అభివృద్ధి మరియు మహిళా సాధికారత డైరెక్టరేట్ సహకారంతో 20 ఏప్రిల్ 2026 నుండి 24 ఏప్రిల్ 2026 వరకు జరగనున్న తెలివైన ఆరోగ్య సంరక్షణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ : పరిశోధన,ఆవిష్కరణ మరియు క్లినికల్ అనువర్తనాలు అనే ఐదు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాన్ని (ఎఫ్.డి.పి) విజయవంతంగా ప్రారంభమైంది. విశిష్ట అతిథుల సమక్షంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. సంస్థ కార్యదర్శి మరియు కరస్పాండెంట్ ఆర్.రామ మోహన రెడ్డి,అధ్యక్షులు ఎం.నాగమల్లా రెడ్డి,ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను మార్చడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. అదేవిధంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో చురుకుగా పాల్గొనవలసిందిగా అధ్యాపకులను ప్రోత్సహించారు. డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగ రెడ్డి నిరంతర అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పరిశోధన,ఆవిష్కరణ మరియు విద్యా నైపుణ్యాన్ని పెంపొందించాలనే సంస్థ యొక్క దార్శనికతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు పయ్యాల కూడా సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ,ఆరోగ్య సంరక్షణ విద్య మరియు పరిశోధనలో (ఏఐ) సాంకేతికతలను అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి,వివిధ రంగాల మధ్య సహకారాలను అభివృద్ధి చేసుకోవడానికి మరియు వినూత్న ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలకు దోహదపడటానికి ఎఫ్‌డిపిని ఒక వేదికగా ఉపయోగించుకోవాలని ఆయన పాల్గొన్నవారిని ప్రోత్సహించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతిలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాళిదాస్ యటూరు,విజ్ఞానదాయకమైన ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మెడికల్ ఇమేజింగ్,ప్రిడిక్టివ్ అనలిటిక్స్,ఇంటెలిజెంట్ క్లినికల్ సిస్టమ్స్ వంటి ఆరోగ్య సంరక్షణ రంగంలోని ఏఐ అనువర్తనాలలో ఇటీవలి పురోగతుల గురించి చర్చించి,ఈ రంగాలలో ప్రభావవంతమైన పరిశోధనలు చేపట్టాలని పాల్గొన్నవారిని ప్రేరేపించారు. ఈ కార్యక్రమానికి ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.మహమ్మద్ షఫీ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఆయన సభకు స్వాగతం పలికి,ఎఫ్‌డీపీ లక్ష్యాలను వివరించారు. నిపుణుల ఉపన్యాసాలు,హ్యాండ్స్-ఆన్ సెషన్‌లు మరియు సహకార అభ్యాసం ద్వారా విద్యా పరిశోధన మరియు వాస్తవ ప్రపంచ క్లినికల్ అనువర్తనాల మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అధ్యాపకులతోపాటు వివిధ సంస్థల నుండి సుమారు 40 మంది ప్రతినిధులు ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. రాబోయే నాలుగు రోజులలో ఎఫ్‌డీపీలో భాగంగా నిపుణుల ప్రసంగాలు,సాంకేతిక సెషన్‌లు, మరియు ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు నిర్వహించబడతాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోని తాజా పురోగతులు మరియు ఇంటెలిజెంట్ హెల్త్‌కేర్‌లో దాని అనువర్తనాల గురించి అధ్యాపకులకు అవగాహన కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొంటూ ప్రముఖులందరూ సభను ఉద్దేశించి ప్రసంగించి ఈ చొరవను అభినందించారు. ఎఫ్‌డీపీ విజయవంతంగా ప్రారంభమైన సందర్భంగా,ధన్యవాదాలతో ఈ కార్యక్రమం ముగిసింది.

# క్రైస్తవుల సమాధుల తోటలకు స్థలాలు మంజూరు చేయాలి

## - అర్హులైన క్రైస్తవులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి
## - జిల్లా క్రిస్టియన్ మైనారిటీ నాయకులు బోనాసి జాన్ బాబు






మదనపల్లె (ప్రజా సీమ) : మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును అన్నమయ్య జిల్లా క్రిస్టియన్ మైనారిటీ నాయకులు, మదనపల్లె 29వ వార్డు ఐటిడిపి అధ్యక్షులు బోనాసి జాన్ బాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా ఎన్నికైన వర్ల రామయ్యను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు. సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలలో,పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జాన్ బాబు మాట్లాడుతూ పేద,బడుగు,బలహీనవర్గాల కొరకు ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ గత రెండేళ్లుగా అభివృద్ధి,సంక్షేమ పథకాలతో ప్రజల మన్ననలు అందుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన కు నిదర్శనమని కొనియాడారు. క్రైస్తవుల సమాధుల తోటలకు స్థలాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన క్రైస్తవులకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. క్రైస్తవల పుణ్య క్షేత్రమైన ఎరుషలేము యాత్రకు ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# రాజంపేట పార్లమెంట్ రైల్వే సమస్యలు తీర్చండి

## - రైల్వే డిఆర్ఎం ను కలిసిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి



రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద సీసీ కెమెరాలు మరియు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలియజేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు స్టేషన్లలో హరిప్రియ ఎక్స్ప్రెస్ మరియు చెన్నై సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ నిలుపుదల లేదని ఆ రైళ్లను కూడా నిలుపుదల చేసి ప్రజల రవాణాకు ఆటంకం కలగకుండా తగు చర్యలు చేపట్టాలని వినపూర్వకంగా తెలియజేశారు. ముఖ్యంగా రైల్వే కోడూరు స్టేషన్ పరిధిలోని బాల్రెడ్డిపల్లి ఎల్ సి గేట్ నెంబర్ 85 ఫ్లైఓవర్ బ్రిడ్జి కి సంబంధించి నిర్మాణాన్ని రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా దారిని మళ్లించాలని దానికి సంబంధించి సర్వే జరిపించి ప్రజలకు రైతులకు వాహనదారులను ఆదుకోవాలని తెలియజేస్తూ, అంతేకాకుండా రాజంపేట రైల్వే స్టేషన్లో లిఫ్ట్ సౌకర్యం మరియు ఎస్కలేటర్ సౌకర్యం, రైల్వే స్టేషన్ , ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించి రాజంపేట రైల్వే స్టేషన్ ను అభివృద్ధి పథంలో నడపాలని ఇలా పలు సమస్యలపై వినతిపత్రం అందించడం జరిగిందని సానుకూలంగా స్పందించిన డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్త మీరు చెప్పిన ప్రతి ఒక్క విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు చేపడతామని సానుకూలంగా స్పందించినట్లు తల్లెం భరత్ కుమార్ రెడ్డి తెలియజేయడం జరిగింది.

# మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం : సి.ఐ నాగార్జున

రాజంపేట (ప్రజా సీమ): రాజంపేటలో మంగళవారం మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన రాజంపేట పట్టణ సి.ఐ నాగార్జున. జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది అని ఆయన అన్నారు. జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు, పాఠశాలలు మరియు కళాశాలల్లో, వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లలో, మహిళలు ఉద్యోగాలు చేసే కంపెనీలలో, గ్రామాలలో, కాలనీ లలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.'శక్తి' యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని రాజంపేట పట్టణ సి.ఐ నాగార్జున తెలిపారు. ఈ యాప్ యొక్క ప్రాముఖ్యత మరియు దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై రాజంపేట పట్టణం లోని గాలివారి పల్లిలో మంగళవారం సాయంత్రం మహిళలకు రాజంపేట ఎ.ఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే ఐ.పి.ఎస్ పర్యవేక్షణలో రాజంపేట పట్టణ సి.ఐ నాగార్జున ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**'శక్తి' యాప్ ఎలా ఉపయోగించాలి?**

ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నపుడు 'శక్తి' యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చున్నారు. ఎస్.ఓ.ఎస్ బటన్, డయల్ 112 నెంబర్ కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే



దిశగా చర్యలు చేపడతారన్నారు.

ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్లైన్ నంబర్లను రాజంపేట పట్టణ సి.ఐ నాగార్జున గుర్తు చేశారు:

- డయల్ 100/112 (అత్యవసర సహాయం)
- చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ)
- గృహ హింస 181
- మహిళ వేధింపులు 1091
- సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930
- సైబర్ మిత్ర

ప్రతి మహిళ తమ భద్రత కోసం ప్రభుత్వ కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి, వారిని చైతన్యవంతులను చేశారు.

# మహమ్మారెమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

## - ఘనస్వాగతం పలికిన నిస్సార్ అహ్మద్,ఆలయ కమిటీ



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణ నడిబొడ్డున వెలసి ఉన్న శ్రీశ్రీ మహమ్మారెమ్మ తల్లి చల్లని దయా,ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆకాంక్షించారు.మంగళవారం మదనపల్లె పట్టణం ఎస్.బి.ఐ కాలనిలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ మహమ్మారెమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు మదనపల్లె వైయస్సార్సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మదులకు ఆలయ కమిటీ వారు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.నిస్సార్ అహమ్మద్ అమ్మవారిని దర్శించుకొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అమ్మవారి ఆశీర్వచనాలు,తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ మహమారెమ్మ ఆలయ పునర్నిర్మాణం ఎంతో అద్భుతంగా ఉందన్నారు.ఆలయ కమిటీ కృషిని ప్రశంసించారు కృపాకటాక్షలతో వర్షాలు సమృద్ధిగా కురియాలని,పంటలు బాగా పండి ప్రతి ఇంట సిరిసంపదలు తులతూగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నిస్సార్ అహమ్మదుతోపాటు మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి,బాబాజాన్,తట్టి శ్రీనివాసులు రెడ్డి,బొమ్మాడి రామకృష్ణా రెడ్డి,మస్తాన్ రెడ్డి,రఘునాథ్ రెడ్డి,మాధవరెడ్డి,వీఎస్ రెడ్డి,సుధాకర్ రెడ్డి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

## –మంత్రి కొల్లు రవీంద్ర

(ప్రజా సీమ)మచిలీపట్నం ఏప్రిల్ 21: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం చాలా చిత్తశుద్ధితో పనిచేస్తుందని, విద్య వైద్య రంగాలకు బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయిస్తుందని, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మరింత మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మంత్రివర్యులు నగరంలోని ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. నగరంలో మంత్రి స్వయంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఆసుపత్రిలోకి ప్రవేశించి అక్కడ అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే ఆసుపత్రి పర్యవేక్షకులను, పార్కింగ్ ఇన్చార్జి వారిని పిలిపించి ఇకపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఉంచకుండా ఒక నిర్దిష్టమైన పార్కింగ్ ప్రదేశంలో ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ ప్రదేశంలో లేకపోతే ఆసుపత్రి బయటనే ఉంచేలా పర్యవేక్షించాలన్నారు. అనంతరం మంత్రి ఆసుపత్రిలో అన్ని విభాగాలను తనిఖీ చేసి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. మరల ఆసుపత్రిని తనిఖీ చేస్తానని ఎక్కడ ఏ లోకం లేకుండా అన్ని ఏర్పాట్లు సరిగా చేయాలన్నారు. తేడా వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అడుగడుగునా రోగులను పరామర్శిస్తూ ప్రజలతో మమేకమై వైద్య సేవలు ఎలా ఉన్నాయి అని ఆరా తీశారు. అక్కడి రోగులు వారి బంధువులతో ముఖాముఖి మాట్లాడి వైద్యం ఎలాగుంది మర్యాదగా ఉంటున్నారా లేదా వైద్యులు అందుబాటులో ఉంటున్నారా లేదా మందులు సరిగా ఇస్తున్నారా లేదా అని ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రివర్యులు ఆసుపత్రి పర్యవేక్షకులు, జనరల్ సర్జన్, సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లతో కలిసి కూర్చొని కాసేపు వారితో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏ పరికరాలు ఉన్నాయి, ఏ పరికరాలు అవసరం ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.


# పీలేరు మండలంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



పీలేరు(ప్రజా సీమ) :పీలేరు మండలంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమావేశం నిర్వహించగా, నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కార్మికుల సమస్యలు, పెండింగ్ క్లైములపై విస్తృతంగా చర్చ జరిగింది.ఈ సందర్భంగా ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు రావలసిన సంక్షేమ పథకాలు, క్లైములు ఇంకా పెండింగ్లో ఉండటం అన్యాయమని పేర్కొన్నారు. కార్మికులు తమ చెమటతో పట్టణాల అభివృద్ధికి సహకరిస్తున్నప్పటికీ, వారికి సరైన సాయం అందకపోవడం బాధాకరమని అన్నారు.పెండింగ్లో ఉన్న క్లైములను వెంటనే పరిష్కరించి, కార్మికులకు రావలసిన ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్మికులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు.అలాగే, అర్హులైన నిర్మాణ కార్మికులకు తక్షణమే ఇంటి స్థలాలు కేటాయించి, నివాస భద్రత కల్పించాలని కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా తీసుకుని చర్యలు చేపట్టకపోతే, కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశం అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం పీలేరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా పరీద్, కార్యదర్శిగా మార్కొండ రెడ్డి, సహాయ కార్యదర్శిగా సురేంద్ర, కోశాధికారిగా ఇరగం రెడ్డి ఎన్నికయ్యారు. అదనంగా మరో 7 మంది సభ్యులను కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు.కార్మికుల హక్కుల సాధన కోసం నూతన కమిటీ కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు

# సీఐటీయూ రాష్ట్ర కమిటీలో జిల్లాకు ప్రాధాన్యత

## - సభ్యులుగా హరిశర్మ,రామాంజులు ఎంపిక



మదనపల్లె (ప్రజా సీమ) : సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులుగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టీ.హరిశర్మ,సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులును రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రకటించింది.మంగళవారం మదనపల్లెలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు హరిశర్మ,రామాంజులు మాట్లాడుతూ సీఐటీయూ 17వ రాష్ట్ర మహాసభలు నంద్యాలలో ఏప్రిల్ 17,18,19లలో మూడు రోజులుపాటు జరిగాయన్నారు.కార్మికులు,ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల మీద చర్చలు జరిపి కార్మిక,కర్షక,ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర అభివృద్ధికి అనేక తీర్మానాలు చేసినట్లు తెలిపారు.ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణకు,లేబర్ కోడ్స్ రద్దు కొరకు,ఎనిమిది గంటలు పనిదినాలు అమలు కొరకు పోరాడతామని పేర్కొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు కే సాధ్యం

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



గాలివీడు(ప్రజా సీమ) రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం ఒక చంద్రబాబుకే సాధ్యమని ఆయన ఆధ్వర్యంలో ఈ రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు వెళుతున్నదని రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం అరవీడు పంచాయతీలు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల వారిని దృష్టిలో పెట్టుకొని వారి అభివృద్ధికి సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని కొనియాడారు. అందులో భాగంగా ఉచిత సిలిండర్లు మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం తో పాటు రైతు సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ ఒంటి పథకాలను అమలు చేస్తున్నదని కొనియాడారు. ప్రతినెల ఒకటో తేదీని వృద్ధాప్య పింఛన్లను 4000 రూపాయలు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రజల దగ్గర నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరింప చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్ రియాజ్, టిడిపి నాయకులు రవీంద్రబాబు రామ్మోహన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి మహమ్మారిని కూకటి వేళ్ళతో పెకిలించి వేసిన బాపట్ల పోలీసులు

బాపట్లబ్యూరో, ఏప్రిల్ 21 : జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా గంజాయి విక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీబి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని విసి హాల్ నందు జిల్లా ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహిం చారు. గంజాయి సంబంధిత కేసులో 29 మంది ముద్దాయిల అరెస్ట్ కు సంబందించిన వివరాలను వెల్లడించారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధా

**- విద్యార్థులు,యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి**

**- జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి వెల్లడి**





మదనపల్లె (ప్రజా సీమ) : గ్రంథాలయాలను విద్యార్థులు,నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి పేర్కొన్నారు.మంగళవారం ఆయన మదనపల్లి పర్యటనలో భాగంగా గొల్లపల్లి రింగ్ రోడ్డులోని ప్రధాన శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు.ముందుగా ఆయనకు గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంతకుమారి ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా గురవారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు నిలయాలని,ఇక్కడ మేధస్సును పెంచే అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు.ముఖ్యంగా విద్యార్థులు,యువత సెల్ ఫోన్లు,సోషల్ మీడియాకు దూరంగా ఉండి పుస్తక పఠనానికి దగ్గర కావాలని సూచించారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రంథాలయాల పరిశీలనలో భాగంగా మదనపల్లికి విచ్చేయడం జరిగిందన్నారు.గ్రంథాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు.అదేవిధంగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు.ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న పుస్తకాలకు మరికొన్ని పుస్తకాలు జోడిస్తామన్నారు.వేసవికాలంలో విద్యార్థులు సమయం వృధా చేసుకోకుండా ఈ శిక్షణ శిబిరాన్ని చక్కగా వినియోగించుకోవాలని సూచించారు.అదేవిధంగా గ్రంథాలయ నిర్వహణ తీరును ఆయన ప్రశంసించారు.అనంతరం గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంతకుమారి ఆధ్వర్యంలో గురువారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీఎస్ఏ కృష్ణమూర్తి,గొల్లపూడి తిరుపతిరావు,రెడ్డెప్ప,నరసింహారెడ్డి,చక్రవర్తి,జ్ఞానోదయ పాఠశాల ఉపాధ్యాయులు,శివ ప్రసాద్,తులసి నాయక్,చంద్ర నాయక్,రవీంద్రబాబు,నాగరాజ,రెడ్డెప్ప మరియు జ్ఞానోదయ పాఠశాల విద్యార్థులు,పాఠకులు పాల్గొన్నారు.

# ఈ నెల 24 నుంచి గంగాభవాని అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

సిద్ధవటం( ప్రజా సీమ ): కడప చెన్నై జాతీయ రహదారి మాధవరం-1 గ్రామపంచాయతీ బంగారు పేటలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి 34 వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఈ నెల 24, 25,26 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఫ్యామిలీ ట్రస్ట్ అధ్యక్షుడు మాడా పెద్ద సుబ్బరాయుడు రామకృష్ణ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 24 శుక్రవారం ఉదయం 8 గంటల నుండి గణపతి పూజ, స్వస్తివాచనము- మాతృకాపూజ ఆచార్యాది ఋత్విక్ వరణము, రక్షాబంధనము- పంచగవ్య ప్రాశనము - నవగ్రహ -వాస్తు - సర్వతోభద్ర మండల ఆరాధనలు- అష్టోత్తర శత కలశాభిషేకం - అర్చన - మంగళహారతి- మంత్ర పుష్పం. మద్యాహ్నం 3 గంటలకు అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన పూజ 'లక్ష కుంకుమార్చన' (పుణ్య స్త్రీ వ్రతం), అనంతరం పూజలో పాల్గొన్న పుణ్యస్త్రీలందరికి అమ్మవారి ప్రసాదంగా మంగళప్రదమైన గాజులు, పసుపు కుంకుమలు అందజేయబడును.ఏప్రిల్ 25 శనివారం ఉదయం 6-00 గంటల నుండి గణపతి హోమం రుద్రస్వాహాకారహోమం- లక్ష్మీసహస్రనామ హోమము- వాస్తు, సర్వతోభద్రమండల హోమములు- శ్రీసూక్త - సరస్వతీ అష్టోత్తర శతనామహోమం దుర్గా- మహోమం దుర్గా సరస్వతీ సూక్త హోమములు - నవగ్రహ చండీహోమము - దేవి సూక్త హోమము - శాంతి హోమము - దిగ్బలి కూష్మాండ బలి ప్రధానము. ఉదయం 8 గంటల నుండి 9 గంటల లోపు "మహాపూర్ణాహుతి" - కుంభాజల ప్రోక్షణం- మంగళ హారతి - మంత్ర పుష్పం - మహాదాశీర్వచనము.మధ్యాహ్నం 12 గంటల నుండి "అన్నదాన మహోత్సవము" రాత్రి 5-00 గంటల నుండి అమ్మవారి "గ్రామోత్సవము" ఏప్రిల్ 26 ఆదివారం ఉదయం 8 గంటలకు నుండి "బోణాల తిరుణాల" (భక్తుల మొక్కుబడుల చెల్లింపులు)



# 22ఏ నిషేధిత భూములు రీ-సర్వే పురోగతి పట్టాదారు

# పాసు పుస్తకాల పంపిణీ అంశాలపై సమీక్ష





(ప్రజా సీమ) మచిలీ పట్నం: ఏప్రిల్ 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి విజయలక్ష్మి మంగళ వారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఎం నవీన్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధానంగా 22ఏ నిషేధిత భూములు, రీ-సర్వే పురోగతి, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ తదితర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ జిల్లాలో కొనసాగుతున్న రీ-సర్వే దశలు, గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్, రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి సంబంధించి తీసుకుంటున్న చర్యలను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కు వివరించారు. గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల పంపిణీకి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా నోటీసులు అందజేసే సమయంలో రైతులు అందుబాటులో లేకపోవడం వల్ల, గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహించే సమయంలోనే నోటీసులపై వారి సంతకాలు తీసుకుంటున్నామని వివరించారు. అయినప్పటికీ రైతులకు ముందస్తుగా సమాచారం అందించేందుకు వాట్సాప్ ద్వారా నోటీసులు పంపించడం, ఫోన్ కాల్స్ ద్వారా సమాచారం ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. ఈ-కేవైసీ విషయంలో కొంతమంది రైతులు ఇంకా అవగాహన పొందలేకపోవడం వల్ల ప్రక్రియ పూర్తిగా జరగడం లేదని తెలిపారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాల్లో రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, రైతులకు సంబంధించిన సేవలను సమర్థవంతంగా అందించాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ ఇంచార్జ్ కలెక్టర్ కు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిల, బందరు ఆర్డిఓ కే సాంబశివరావు, సర్వే ఏడి కే లక్ష్మణరావు, కలెక్టరేట్ ఏవో రాధిక ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల గుమ్మం వద్దకే కూటమిపాలన

**-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**-వి.ఓ.ఎలకు సెల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**





(ప్రజా సీమ), గుడివాడ ఏప్రిల్ 21:"ప్రజల గుమ్మం వద్దకు కూటమి ప్రభుత్వ పాలన చేరాలన్నదే మా లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.ఆ దిశగా గ్రామ స్థాయిలో పనిచేసే బుక్ కీపర్లకు స్మార్ట్ ఫోన్లను ప్రభుత్వం అందించిందన్నారు. గుడివాడ మండల పరిధిలోని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (బుక్ కీపర్) లకు ప్రభుత్వం సమకూర్చిన స్మార్ట్ ఫోన్లను ప్రజా వేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే రాము మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బుక్ కి ఎమ్మెల్యే రాముకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు మంచి చేయడంలో అందరం కలిసి పని చేద్దామని బుక్ కిపర్లతో ఎమ్మెల్యే రాము అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు అందుకున్న బుక్ కీపర్ సోదరీమణులందరికీ అభినందనలు చెప్తున్నానన్నారు. మీరు గ్రామ స్థాయిలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలన్నారు. మీ పని మరింత సులభతరం చేయడానికి, డిజిటల్ పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన స్మార్ట్ ఫోన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేరుగా ఆన్‌లైన్‌లోనే లెక్కలు, రికార్డులు మెయింటైన్ చేయడం వల్ల పారదర్శకత పెరిగి, అవినీతికి తావు ఉండదని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తున్నామని ,బుక్ కీపర్లకు టెక్నాలజీ అందించడం అందులో భాగమేనన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఎండిఓ విష్ణుప్రసాద్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, బిజెపి నాయకుడు ఎర్రపోతు అర్జున్,ఎపియం కేవీ వసంతరావు ,సీసీలు జ్యోతి , రత్న మరియం,ఎమ్మెస్ అధ్యక్షులు లక్ష్మి , మండలంలోని బుక్ కీపర్లు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం

**- క్లాత్ బ్యాగుల వినియోగంపై అవగాహన కార్యక్రమం**






(ప్రజా సీమ)శ్రీకాకుళం,ఏప్రిల్ 21: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి, ప్రతి ఒక్కరూ క్లాత్ బ్యాగులను వినియోగించాలని పిలుపునిస్తూ శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కూర్మా రావు ముఖ్య అతిథిగా హాజరై, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే హానులను వివరించారు. ప్లాస్టిక్ వల్ల భూమి, నీరు, గాలి కాలుష్యం పెరిగి, భవిష్యత్ తరాలకు తీవ్రమైన ప్రమాదాలు కలుగుతాయని ఆయన అన్నారు. అందువల్ల ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి, షాపింగ్‌కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా చేతి సంచులు (క్లాత్ బ్యాగులు) తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అన్న క్యాంటీన్ సీఈవో వంశీ ముఖ్య అతిథిగా పాల్గొని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న మార్పులతో పెద్ద ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.అరుణోదయ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ మరియు ఎంవిఆర్ కంపెనీ ఆధ్వర్యంలో, అరుణ్ కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటస్వామి, మున్సిపల్ సిబ్బంది, నిర్వాహకులు అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడటం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వారు పునరుద్ఘాటించారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# భయపడే సమయం కాదు... పోరాడే సమయం

### - జాతీయ చైర్మన్ కొమ్మోజు రమేష్ పిలుపు
### - నాయుడుపేటలో నూతన కమిటీ ఎన్నిక




నాయుడుపేట (తిరుపతి జిల్లా): ఫోరం ఫర్ =× అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయుడుపేట నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం తిరుపతి జిల్లా నాయుడుపేటలోని అంబేద్కర్ భవనంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సంస్థ జాతీయ చైర్మన్ డా. కొమ్మోజు రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు పి. బుచ్చిబాబు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. వెంకట వేణు, బి. వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు డా. ఎం. చంద్రకళ, అలాగే నాయుడుపేటకు చెందిన పెద్దలు వెంకటేశ్వర్లు, నాగూరయ్య, సుబ్రహ్మణ్యం, పద్మనాభం, రామచంద్రయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పంగులూరు బుచ్చిబాబు నాయుడుపేట నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా టి. రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఎం. ముత్యాలయ్య, కార్యదర్శిగా జి. శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా సిహెచ్. మురళి, కోశాధికారిగా మొగల్ సాజిదా, సభ్యులుగా టి. అర్జున్ అయ్యా, ఈ. వెంకట రమణయ్య, వై. రామయ్య, షేక్ మస్తాన్, సిహెచ్. సుధాకర్, షేక్ పైరోజు, మనమ్మ ఎన్నికయ్యారు. లీగల్ అడ్వైజర్‌గా ప్రముఖ న్యాయవాది ఎం. సౌమ్యను నియమించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ జాతీయ చైర్మన్ డా. కొమ్మోజు రమేష్ మరియు రాష్ట్ర కమిటీ సభ్యుల చేతుల మీదుగా నియామక పత్రాలు, ఐడీ కార్డులు అందజేశారు. అలాగే ఉమెన్ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా డా. ఎం. చంద్రకళను ప్రకటించి, వారికి కూడా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డా. కొమ్మోజు రమేష్ మాట్లాడుతూ "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు, మహాత్మా జ్యోతిరావు ఫూలే గారు కలలుగన్న సమానత్వ సమాజం కోసం మనం పని చేయాలి. వారు చూపిన మార్గం విద్య, అవగాహన, హక్కుల సాధన. ఈ సంస్థను స్థాపించిన ప్రధాన ఉద్దేశం ప్రజలకు సమాచార హక్కు (=×) మరియు మానవ హక్కులపై అవగాహన కల్పించడం. =× చట్టం ప్రజల చేతిలో ఉన్న శక్తివంతమైన ఆయుధం. దీని ద్వారా అవినీతిని వెలికితీసి, ప్రజలకు న్యాయం సాధించవచ్చు. మానవ హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా లభించాలి. వాటి పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు ముందుకు రావాలి" అని అన్నారు. అలాగే యువత అంబేద్కర్, ఫూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సమానత్వం, న్యాయం, పారదర్శకత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఫోరం కార్యకలాపాలను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సభ్యులు, మహిళలు, యువత మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తిరుపతిలో ఏప్రిల్ 26 నుండి జరిగే ఏఐటీయుసి రాష్ట్ర మహాసభలను జయప్రధానికై ప్రధానికే బైక్ ర్యాలీ

### - కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ రద్దు కై ఉద్యమిద్దాం



కాకినాడ, (ప్రజా సీమ) :ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటియుసి ఆధ్వర్యంలో ఏప్రిల్ 26 నుండి 28 వరకు తిరుపతి పుణ్యక్షేత్రంలో జరిగే ఏఐ టియుసి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మంగళవారం ఉదయం బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా ఏఐటి యుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుపతిలో జరిగే ఏ ఐ టి యు సి రాష్ట్ర మహాసభల జయ ప్రధానికై కాకినాడలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, బైక్ ర్యాలీ మొదట కాకినాడలో స్థానిక వీర్ కమల్ థియేటర్ నుండి ప్రారంభమై కరణం గారి సెంటర్, జి బి టి రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, కొండయ్య పాలెం, మిలిటరీ రోడ్డు, రామారావు పేట మూడు లైట్లు జంక్షన్ వద్ద ముగింపు జరిగిందని ఆయన అన్నారు. తిరుపతిలో ఏప్రిల్ 26వ తేదీన భారీ ప్రదర్శన బహిరంగ సభ జరగనున్నదని మొదట ప్రదర్శన ఆర్టీసీ బస్టాండ్ నుండి ప్రారంభమవుతుందని ఇందిరా మైదాన గ్రౌండ్లో భారీ బహిరంగ సభ జరిగినని ఆయన తెలియజేశారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని ప్రదేశాల్లో నష్టపరహారాలు, పర్మినెంట్ కార్మికులకు డిఏలు, సరెండర్ లీవులు బిల్లులు, చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకై తిరుపతి ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలో భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ పోరాటానికై వేదిక కానున్నాయని ఆయన అన్నారు. కార్పొరేటర్లకు అనుకూలత కార్మికుల వ్యతిరేకత నరేంద్ర మోడీ నిరంకుశ మొండు వైఖరి విడనాడాలని కార్మికుల వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని కార్మికులు పక్షాన నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం ఏఐటీయూసీ అని తిరుపతిలో 26 జరిగే భారీ ప్రదర్శన బహిరంగ సభకు ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాలు ఆటో, హమాలీ, వీధివిక్రయ, భవన నిర్మాణ, మున్సిపల్, మెడికల్, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, అంగనవాడి, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం, స్కూల్స్ పేపర్స్, గ్రామీణ ఉపాధి కూలీలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి శ్రీనివాసరావు, తుపాకుల లక్ష్మీనారాయణ, సుబ్బలక్ష్మి, రాజేష్, సత్తిబాబు, శ్రీను, అప్పన్న, మణికంఠ, కుమార్, హరికృష్ణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతుల మీదుగా పోషణ పక్వాడ పోస్టర్ ఆవిష్కరణ

### - బిబిసిడిపిఓ పద్మావతి సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించిన ఎమ్మెల్యే



కాకినాడ, (ప్రజా సీమ) : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పార్టీ కార్యాలయం వద్ద ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి మరియు శంఖవరం ×జణా ప్రాజెక్ట్ సిడిపిఓ శ్రీమతి పర్వత వెంకట లక్ష్మీ ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ పోస్టర్ ను ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ చిన్నారులను సక్యం అంగన్వాడీ కేంద్రాల ద్వారా రెండు సంవత్సరాల వయస్సు నుండి ఆరు సంవత్సరాల వరకు మంచి అలవాట్లు, నేర్పిస్తూ పౌష్టికాహారం అందిస్తూ ఉత్తమ విద్యావంతులుగా తయారు చేసే బాధ్యతను నిర్వహిస్తున్న ప్రతి అంగన్వాడి సిబ్బందికి అభినందనలు తెలిపారు. తమ వృత్తిని బాధ్యతగా నిర్వర్చలని కోరారు. మీ ద్వారానే ఉత్తమ విద్యార్థులుగా చిన్నారులు తయారవుతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, చక్రవేణి సూర్య కుమారి, వరలక్ష్మి , మంగా రత్నం ,రజని మరియు అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని, విద్యార్థులకు - ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు మరియు మాదక ద్రవ్యాలు పైన అవగాహన



కాకినాడ,(ప్రజా సీమ) : మంగళవారం కాకినాడ ఇంద్రపాలెం జెడ్ పి ఎచ్ హై స్కూల్ నందు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు" అవగాహన కల్పించినారులి. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహనలో భాగంగాలి. ఆటో లలో పరిమితికి మించి ఎక్కువ మంది ఆటో లలో ప్రయాణించరాదని, ఆటోలలో వెనుకవైపు, మరియు ఆటో డ్రైవర్ కి ఇరువైపులా కూర్చోరాదని, ఆటోలు నడుపు ఆటో డ్రైవర్లు (3౦1) పరిమితికి మించి పాసెంజర్లను/ (6౦1) మించి స్కూల్ పిల్లలను ఆటో లో ఎక్కించికుని తీసుకు వెళ్ళరాదని, పైన తెలిపిన సూచనలు పాటించని యెడల ఆటో డ్రైవర్స్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని, జీబ్రా లైన్స్ లేని ప్రదేశములలో రోడ్డు ను ఏవిధంగా దాటాలి, ట్రాఫిక్ సిగ్నల్ వలన ఉపయోగములు మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ఈ విషయమై తమ కుటుంబ సభ్యులకు మరియు తల్లి తండ్రులకు తెలియజేయాలనీ, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వలన జరుగు ప్రమాదములు గురించి, బస్సులలో ఫుట్ పాత్ ప్రయాణం చేయరాదని చెప్పడం జరిగినది. వాహనములను అతి వేగముగా నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలుగు ప్రమాదాలు గురించి, అవగాహనను ద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, ఆన్లైన్ గేమ్స్, ఆ బెట్టింగ్స్ మరియు చేడు అలవాట్లు కలిగిన వారికి దూరంగా ఉండాలని మీ యొక్క పరిసరళలో మత్తు పదార్థాలు ఏమైనా గుర్తించినట్లయితే వెంటనే 1972 కి కాల్ చేయాలని తెలియజేయడం జరిగింది తదుపరి మహిళల భద్రత మరియు చట్టాలు గురించి వారికి తెలిజేయడం జరిగినది. సైబర్ నేరలలో భాగముగాలిఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్స్ డిజిటల్ అరెస్టు112, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్-1 సి ఐ ఎన్ రమేష్, మరియు ట్రాఫిక్ సిబ్బంది హాజరు అయినారు

# మన ఊరు బడిని కాపాడుదాం ప్రభుత్వ విద్యా రంగాన్ని ప్రోత్సహిద్దాం

### - బడి పిలుస్తుంది కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు




కాకినాడ, (ప్రజా సీమ) : మన ఊరు బడిని కాపాడుకొని, ప్రభుత్వ విద్యా రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని ప్రభుత్వ స్కూల్లోనే చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ప్రమాణాలు మెరుగుపరిచి, మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని కల్పిస్తున్నామని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక దుమ్మలపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్ ప్రాంతంలో మంగళవారం యూటీఎఫ్ కాకినాడ నగర శాఖ తరపున ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని శాసనసభ్యులు వనమాడి కొండబాబు ప్రారంభించారు. పాఠశాల పరిసరాలలోని దుమ్ములపేటలో ఇంటింటికి వెళ్లి పిల్లలను మున్సిపల్ పాఠశాలలో జాయిన్ చేయాలని తల్లి తండ్రులను కోరారు. పాఠశాల ప్రమాణాల గురించి స్థానికులను అడిగి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మెరుగైన బోధన చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను జాయిన్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి మొదట ప్రాధాన్యత ఇస్తూ పాలన కొనసాగిస్తుందని, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు గారి సారధ్యంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దడం జరుగుతుందని, దుమ్ములపేట ప్రైమరీ స్కూల్ ని హైస్కూల్ గా అప్ గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా అసంపూర్ణంగా ఉన్న నూతన తరగతి గదులు తక్షణమే పూర్తి చేసి పాఠశాల రీ ఓపెనింగ్ సమయానికి విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్ ఎంఈఓ -2 సిహెచ్ రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ధర్మరాజు, స్థానిక నాయకులు తుమ్మల సునీత రమేష్, ఎరిపిల్లి రాము, మూగు రాజు, చొడు పిల్లి సతీష్, మాదే ఆంద్రియా, మోసా పేతురు, రాజేశ్వరి, ఎర్రిపెల్లి సత్తిబాబు, మోస ఏసేబు, ఎస్ కె నఫీసా సుల్తానా, ఎస్ ఎం సి చైర్మన్ కొండెల జగన్నాదం యుటిఎఫ్ నాయకులు సిహెచ్.వి. రమణ, కె.సువర్ణ రాజు, సిహెచ్ ఆశీర్వాదం, కెఎంకె మూర్తి, సిహెచ్ వరహాలు బాబు, వజ్రపు మహేష్, కె. భూపతి రెడ్డి, ఎం. అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై పశువుల తరలింపు చర్యలు

### -- కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



కాకినాడ, (ప్రజా సీమ) : నగరంలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను పశువుల సంరక్షణ కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపడుతున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. నగరంలోని 5వ డివిజన్ పరిధిలో జిల్లా కలెక్టరు, ఎస్పీ బంగ్లా ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లపైకి చెట్ల కొమ్మలు వేలాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాటిని తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై పశువుల సంచారం అధికంగా ఉండటం ప్రజలకు ప్రమాదకరంగా మారిందని పేర్కొన్న కమిషనర్, వాటిని ట్రాలీలలో ఎక్కించి ఎస్‌పీసీఏ కేంద్రాలకు తరలిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలో దోమల నివారణ కోసం ప్రతిరోజూ ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ అర్జున్,రత్నమాల, శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం



## ఓట్స్ అధికంగా తింటే అనర్థాలు.. జాగ్రత్త!

ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు.

**అతిగా ఓట్స్ తింటే అనర్థాలు**

ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం. ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం. ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి.

**అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు**

ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు. ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది.

**ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్**

ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది.

మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.

## పాలక్ కోకోనట్ రైస్..తక్కువ టైంలో ఎక్కువ రుచి..ఎలా చేసుకోవాలంటే






పాలక్ కోకోనట్ రైస్ రైస్ ఒక సుగంధభరితమైన, రుచికరమైన వంటకం. ఇది పాలకూర, కొబ్బరి పాల కలయికతో ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. ఇది లంచ్ బాక్స్ ల్లోకి, తేలికపాటి భోజనానికి లేదా ప్రత్యేక సందర్భాలలో వడ్డించడానికి కూడా చాలా బాగుంటుంది. దీనిని తయారు చేయడం చాలా సులభం, తక్కువ సమయంలోనే సిద్ధం చేసుకోవచ్చు. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు -బాస్మతి బియ్యం - 2 కప్పులు -పాలకూర - 2 కప్పులు -కొబ్బరి పాలు - 1.5 కప్పులు -ఉల్లిపాయ - 1 పెద్దది -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్ -ఆవాలు - 1 టీ స్పూన్ -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1/2 టీ స్పూన్ -శనగపప్పు - 1/2 టీ స్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు -పసుపు - 1/4 టీ స్పూన్ -ఉప్పు - రుచికి సరిపడా -కొత్తిమీర - గార్నిష్ కోసం -జీడిపప్పు - 1 టేబుల్ స్పూన్ -నిమ్మరసం - కొన్ని చుక్కలు.

తయారీ విధానం -ముందుగా బాస్మతి బియ్యాన్ని 2-3 సార్లు శుభ్రంగా కడిగి అరగంటసేపు నీటిలో నానబెట్టండి. -తర్వాత పాలకూరను శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన పెట్టుకోండి. మీరు కావాలనుకుంటే పాలకూరను కొద్దిగా ఉడికించి లేదా ఆవిరిలో మగ్గించి కూడా ఉపయోగించవచ్చు. -ఇప్పుడు ఉల్లిపాయను సన్నగా తరుగుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీల్చండి. అల్లం,వెల్లుల్లిని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఎండుమిర్చిని చిన్న ముక్కలుగా తుంచుకోండి. -స్టవ్ మీద ఒక మందపాటి అడుగు కలిగిన గిన్నె లేదా కుక్కర్ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేసి వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత జీలకర్ర, మినపప్పు, శనగపప్పు వేసి అవి కొద్దిగా రంగు మారే వరకు వేయించండి. ఇప్పుడు ఎండుమిర్చి,కరివేపాకు వేసి వేయించండి. తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు ఇందులో తరిగిన పాలకూర వేసి 2-3 నిమిషాలు లేదా అది మెత్తబడే వరకు ఉడికించాలి. -పాలకూర మగ్గిన తర్వాత కొబ్బరి పాలు పోయాలి. తర్వాత నానబెట్టిన బియ్యంలోని నీటిని వడగట్టి బియ్యం వేయాలి. పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. -గిన్నెకు మూత పెట్టి లేదా కుక్కర్ మూత పెట్టి మీడియం మంట మీద ఉడికించాలి. మీరు గిన్నెలో ఉడికిస్తుంటే నీరు పూర్తిగా ఇంకిపోయి అన్నం మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఇది సుమారు 15-20 నిమిషాలు పట్టవచ్చు. మీరు కుక్కర్ లో ఉడికిస్తుంటే 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. ప్రెజర్ పూర్తిగా తగ్గిన తర్వాత మూత తీయండి. -అన్నం ఉడికిన తర్వాత ఒకసారి మెల్లగా కలపండి. సన్నగా తరిగిన కొత్తిమీర, వేయించిన జీడిపప్పు పలుకులతో గార్నిష్ చేయండి. కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం పిండితే మరింత రుచిగా ఉంటుంది. -పాలక్ కొబ్బరి అన్నం వేడి వేడిగా రైతా, పెరుగు లేదా ఏదైనా కూరతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

## రాగి పిండితో హెల్దీ బన్ దోశలు..

### పీకలదాకా తిన్నా ఇంకోటి కావాలంటారు..ఎలా చేయాలంటే




మన ఆరోగ్యం మొత్తం దాదాపు మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. కరోనా తర్వాత నుంచి అధికశాతం మంది తమ ఆరోగ్యంపై ఎక్కువ ఫోకస్ పెడుతూ హెల్దీ ఫుడ్ తీసుకుంటున్నారు. హెల్దీ ఫుడ్స్ లో రాగి పిండితో చేసే బన్ దోశలు కూడా ఒకటి. సాధారణంగా పొద్దున్నే పూరీ,బోండా,ఇడ్లీ,బియ్యం పిండితో దోశ వంటివి మనం తింటుంటాం. అయితే ఇవి కాకుండా పొద్దున్నే రాగిపిండితో చేసే హెల్దీ బన్ దోశలు ఓ సారి టేస్ట్ చేసి చూడండి..అస్సలు వదలిపెట్టరు. అంత రుచిగా ఉంటాయి..అంతేకాకుండా ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. రాగి పిండిలో ఐరన్, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాంటి రాగి పిండితో హెల్దీ బన్ దోశలు ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి. రాగి పిండితో బన్ దోశలు తయారీకి కావాల్సిన పదార్థాలు -రాగి పిండి -బొంబాయి రవ్వ -పెరుగు -నీళ్లు -ఆవాలు -జీలకర్ర -కరివేపాకు -ఆయిల్ -ఇంగువ -పచ్చిమిర్చి. రాగి పిండితో బన్ దోశలు తయారీ విధానం -రాగి బన్ దోశలు తయారుచేయడం కోసం ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకొని అందులో అరకప్పు బొంబాయి రవ్వ, 1 కప్పు రాగి పిండి, 1 కప్పు పెరుగు వేసి మొత్తం కలిసేలా కలుపుకున్నాక ఇందులో అరకప్పు నీళ్లు పోసి బాగా కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టేయాలి. -10 నిమిషాలు నానిన తర్వాత ఈ పిండిని మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు ఏమీ వేయకుండానే దోశ పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండిని గిన్నెలోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో ఒకటిన్నర స్పూన్ ఆయిల్ వేడి చేసి ఇందులో కొద్దిగా ఆవాలు,జీలకర్ర వేసి అవి చిటపటలాడిన తర్వాత కొద్దిగా ఇంగువ వేసి కలిపాక 2 పచ్చిమిర్చి తరుగు,కొద్దిగా కరివేపాకు వేసి ఫ్రై అయ్యాక ఇందులో చిన్నగా కట్ చేసిన 1 టమాటో ముక్కలు వేసి అవి కొంచెం మెత్తబడేదాకా ఫ్రై చేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.ఈ తాళింపుని ముందుగా రెడీ చేసుకున్న పిండిలో వేసేయాలి. ఇందులోనే సన్నగా కట్ చేసిన 2 ఉల్లియాల ముక్కలు, కొత్తిమీర తరుగు,రుచికి తగినట్లుగా ఉప్పు, కొద్దిగా వంటసోడా వేసి పిండిలో అన్నీ బాగా కలిసేలా కలుపుకోవాలి. - ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాండీ పెట్టి అందులో కొంచెం ఆయిల్ వేసి దానిమీద పెద్ద గరిట పిండిని వేసుకొని ఒకవేపు కాలిన తర్వాత తిప్పుకొని దానిని రెండోవైపు కాల్చి దించేయాలి. అంతే రాగి బన్ దోశలు రెడీ. దీనిని మీకు నచ్చిన చట్నీతో కలిపి తింటే నోట్లో బ్లాస్టే.

## ఇది తినని మనిషి జన్మ ఎందుకు..

### మన పూర్వీకుల ఎనర్జీకి కారణం ఇదే..ఎలా చేసుకోవాలంటే



మీరెప్పుడైనా రాగిపిండి, సగ్గుబియ్యం కిచిడి తిన్నారా? సూపర్ టేస్ట్ ఉంటుంది. ఈ కిచిడి ఒక పోషకవైన,తేలికగా జీర్ణమయ్యే ఆహారం. రాగిలో ఐరన్, కాల్షియం,ఫైబర్ పుష్కలంగా ఉంటాయి..సగ్గ బియ్యం తక్షణ శక్తిని అందిస్తాయి. ఈ రెండింటి కలయికతో తయారైన కిచిడి రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రాగిపిండి సగ్గుబియ్యం కిచిడిని మీ ఇంట్లోనే సింపుల్ గా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీకి కావలసిన పదార్థాలు -పెసరపప్పు -సగ్గుబియ్యం -రాగిపిండి -మిరియాలు -జీడిపప్పు -పచ్చిమిర్చి -నెయ్యి -అల్లం -పసుపు -క్యారెట్ -ఉల్లిపాయ -టమాటో -వెల్లుల్లి -జీలకర్ర -కరివేపాకు


రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీ విధానం -ముందుగా ఓ ప్రెజర్ కుక్కర్ లో శుభ్రంగా కడిగిన అరకప్పు పెసరప్పు, అరకప్పు సగ్గు బియ్యం, 4 పచ్చిమిర్చి ముక్కలు, 1 టమాటో పెద్ద ముక్కలు, 1 ఉల్లిపాయ పెద్ద ముక్కలు, 1 క్యారెట్ ముక్కలు,కొన్ని అల్లం ముక్కలు, పొట్టు తీసిన 2 వెల్లుల్లి రెబ్బలు, 10-15 మిరియాలు, చిటికెడు పసుపు వేయాలి. ఇందులో ముక్కలు మునిగేదాకా నీళ్లు పోసి కలిపి మూతపెట్టి స్టవ్ మీద పెట్టాలి. -రెండు విజిల్స్ వచ్చాక స్టవ్ ఆఫ్ చేసేయండి. ప్రెజర్ అంతా పోయిన తర్వాత కుక్కర్ మూత తీసి ఉడికిన పప్పుని గుత్తితో మెత్తగా మాష్ చేసుకోవాలి. -తర్వాత మళ్లీ స్టవ్ ఆన్ చేసి అది ఉడకనివ్వాలి. ఉడికే సమయంలోనే అందులో అరకప్పు రాగిపిండి ఉండల్లేకుండా బాగా కలపుతూ మంటను సిమ్ లో పెట్టి ఉడికించుకోవాలి.

10 నిమిషాలు రాగిపిండిని అందులో బాగా ఉడికించుకున్నాక రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి దగ్గరపడేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 2-3 స్పూన్ల నెయ్యి వేడి చేశాక జీడిపప్పు,మిరియాలు వేసి ఫ్రై చేసుకోవాలి. -జీడిపప్పు వేగిన తర్వాత కరివేపాకు,జీలకర్ర వేసి వేయించుకొని తర్వాత ఈ తాళింపు మొత్తాన్ని ముందుగా ఉడికించిన కిచిడిలో వేసి కలుపుకోవాలి. ఇందులో అరచెక్క నిమ్మరసం పిండి బాగా కలుపుకోవాలి. అంతే రాగి పిండి సగ్గుబియ్యం కిచిడి రెడీ.


PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సినిమా న్యూస్



## అందాల డోస్ పెంచిన శ్రీలీల.. ఫ్యాన్స్ ఫిదా!



టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల లేటెస్ట్ ఫోటోషూట్‌తో నెటిజన్ల మనసు గెలుచుకుంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రమోషన్ల కోసం ఆమె ధరించిన బేజ్ కలర్ అనార్కలీ డ్రెస్‌లో దేవకన్యలా మెరిసిపోతోంది. మృణాళిని రావు డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్‌లో శ్రీలీల లుక్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే లక్షలాది లైకులతో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. కేవలం డాన్స్‌తోనే కాదు, తన క్లాసీ లుక్స్‌తోనూ ఆమె మ్యాజిక్ చేస్తోంది.శ్రీలీల తాజా ఫోటోషూట్ చూస్తుంటే ఎవరైనా సరే వావ్ అనాల్సిందే. మృణాళిని రావు కలెక్షన్ నుంచి ఎంచుకున్న 'వల్లి అనార్కలీ' సెట్‌లో ఆమె చాలా ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. సిల్క్ ఫ్యాబ్రిక్‌తో చేసిన ఈ డ్రెస్‌పై ఉన్న హ్యాండ్ ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె అందాన్ని మరింత పెంచింది. దీనికి తోడు 'బిడాజిల్స్' అందించిన జువెలరీ పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. గ్లామర్ షోకు దూరంగా, ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో కూడా శ్రీలీల ఎంత గ్రేస్‌ఫుల్‌గా ఉండగలదో ఈ ఫోటోలు నిరూపిస్తున్నాయి.శ్రీలీల కేవలం అందానికే పరిమితం కాకుండా, వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఈ ఏడాది పవన్ కళ్యాణ్ సరసన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాతో ప్రేక్షకులను అలరించింది. అలాగే శివకార్తికేయన్ హీరోగా వచ్చిన 'పరాశక్తి' సినిమాలో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇక 1960ల నాటి రాజకీయ నేపథ్యంలో సాగే ఆ చిత్రంలో శ్రీలీల తన చలాకీతనంతో అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ రెండు సినిమాలు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ రికార్డు వ్యూస్ సాధిస్తుండటం విశేషం. టాలీవుడ్‌లో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను దక్కించుకుంది శ్రీలీల. స్టార్ హీరోలందరి సరసన వరుస ఆఫర్లు కొట్టేస్తూ దూసుకుపోతోంది. ఆమెలో ఉన్న ఎనర్జిటిక్ డాన్స్, చలాకీతనం చూసి మేకర్స్ సర్‌ప్రైజ్ అవుతున్నారు. గ్లామర్ పాత్రలైనా, నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ అయినా తనదైన స్టైల్‌లో న్యాయం చేస్తోంది. ఇక అందుకే ఇప్పుడు సోషల్ మీడియాలో ఆమె పెట్టిన ఫోటోలకు కేవలం 10 గంటల్లోనే దాదాపు 2 లక్షల లైకులు రావడం చూస్తుంటే ఆమె క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.మొత్తానికి శ్రీలీల తన అందం, అభినయంతో ఆడియెన్స్‌ను మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

## రెడ్ హాట్ పాలక్ బ్యూటీ



బాలీవుడ్‌లో సహాయ దర్శకురాలిగా కెరీర్‌ను ప్రారంభించి సముద్దుగుమ్మ పాలక్ తివారీ. ఈ అమ్మడు తక్కువ సమయంలోనే బాలీవుడ్ ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. అంతిమ్ సినిమాకు సహాయ దర్శకురాలిగా వర్క్ చేస్తున్న సమయంలోనే ఈమెలో నటిని గమనించిన కొందరు ఆ దిశగా ప్రయత్నాలు చేయమని సలహా ఇచ్చారట. దాంతో ఈ అమ్మడు మెల్లగా మోడలింగ్, యాక్టింగ్ వైపు మళ్లింది. తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. మోడలింగ్‌లోనూ దూసుకు పోతుంది. చాలా తక్కువ సమయంలో సోషల్ మీడియాలో మంచి పాపులారిటీని ఈ అమ్మడు దక్కించుకుంది. హీరోయిన్స్‌కి ఏ స్థాయిలో ఇన్‌స్టాలో ఫాలోవర్స్ ఉంటారో ఆ స్థాయిలో ఈ అమ్మడికి ఫాలోవర్స్ ఉన్నారు అంటే ఈమె ప్రతిభ, అందం ఏంటో అర్థం చేసుకోవచ్చు. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఈ అమ్మడు ట్రెండ్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. ఇండస్ట్రీలో ఉన్న సంబంధాల కారణంగా సహాయ దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాలక్ తివారీ 2023లో సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన కిసీ కా భాయ్ కిసీ కి జాన్ సినిమాలో కీలక పాత్రలో కనిపించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత బిజ్లీ బిజ్లీ అనే మ్యూజిక్ వీడియోను చేయడం ద్వారా మరింతగా సోషల్ మీడియాలో పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇక రోసీ సినిమాలో నటించిన ఈమెకు నటిగా మరింత మంచి మార్కులు దక్కాయి. సోలో హీరోయిన్‌గా సినిమాలు చేయడం కోసం వెయిట్ చేస్తున్న ఈ అమ్మడు మరో వైపు మోడలింగ్ చేస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా ఫోటోలను, వీడియోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతున్న విషయం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 50 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న పాలక్ తాజాగా మరో అందాల ఆరబోత ఫోటో షూట్ ను చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. సాదారణంగా ముద్దుగుమ్మలు రెడ్ డ్రెస్‌లో కన్నుల విందు చేయడం మనం చూస్తూ ఉంటాం. ఇక పాలక్ తివారీ అంతకు మించి అన్నట్లుగా అందాల ఆరబోత చేయడం ద్వారా కన్నుల పండుగ అన్నట్లుగా ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ పాలక్ తివారీ సొంతం. అందుకే ఈ రెడ్ డ్రెస్‌లో అంతకు మించి అన్నట్లుగా అందంగా, ఆకర్షణీయంగా పాలక్ కనిపిస్తోందని నెటిజన్స్, ముఖ్యంగా ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. గతంలోనూ పాలక్ అందాల ఆరబోత ఫోటోలు, మోడలింగ్ ఫోటోలను షేర్ చేసింది. అయితే ఈ స్థాయిలో ఆ ఫోటోలు అందంగా కనిపించలేదని, ఈసారి రెడ్ హాట్ అన్నట్లుగా అనిపిస్తోంది అంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న ఈ అమ్మడికి ఎందుకు బాలీవుడ్ నుంచి బల్క్ ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు విచారం వ్యక్తం చేస్తున్నారు.

## పూరి రెండున్నర దశాబ్దాల ప్రయాణం!



తెలుగు సినీ పరిశ్రమలో మాస్ అనే పదానికి సరి కొత్త నిర్వచనం పరిచయం చేసిన దర్శకుడు పూరి జగన్నాథ్. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి అదే పరిశ్రమలో తానో బ్రాండ్ గా ఎదిగారు. తన కలం బలంతో దర్శకుల్లో స్టార్ హీరోల ఇమేజ్ నే మార్చేసిన ఓ కొత్త తరం దర్శకుడాయన. సిటీకి ఎంతో మంది కమీషనర్లు వస్తుంటారు...పోతుంటారు. కానీ చంటిగాడు లోకల్ అన్న డైలాగ్ లా -పరిశ్రమకు ఎంతో మంది దర్శకులు వస్తుంటారు. పోతుంటారు. కానీ పూరి అనేవాడు ఓ బ్రాండ్ అంటూ తన డైలాగ్ నే తన ఐడెంటీగా మార్చేసు కున్నాడు. హీరో క్యారెక్టరైజేషన్‌లో పూరి చూపించే వైవిధ్యం, రాసే పవర్ ఫుల్ డైలాగ్స్ పూరిని ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలబెట్టాయి. పూరి పరిశ్రమలోకి అడుగు పెట్టి నేటితో 26 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. పూరి కెరీర్ ప్రారంభంలోనే -బద్రి- వంటి సంచలన విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్‌ను మలుపు తిప్పారు. అటుపై రిలీజ్ అయిన -ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం-,- ఈ అమ్మాయి చాలా మంచి వాడు-వంటి చిత్రాలు ఆయనలోని సున్నితమైన భావోద్వేగాలను ఆవిష్కరించాయి. అయితే -ఇడియట్- సినిమాతో పూరి జగన్నాథ్ టాలీవుడ్ ముఖచిత్రాన్నే మార్చేశారు. అప్పటి వరకు ఉన్న పద్ధతి గల హీరో పాత్రలను పక్కన బెట్టి -పోకిరి- తత్వమున్న హీరోని పరిచయం చేసి యువతలో ఓ ఊపు తెచ్చారు. పూరి కెరీర్‌లో -పోకిరి- ఓ మైలురాయి. ఆ సినిమాతో మహేష్ ను మాస్ ప్రేక్షకులకు దగ్గర చేయడమే కాదు. అప్పటి వరకూ ఉన్న ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసిన చిత్రమది. మహేష్ ని వంద కోట్ల క్లబ్లో చేర్చిన చిత్రమది. ఈ చిత్రం తో పూరి జగన్నాథ్ ఇమేజ్ ను తెచ్చుకున్నారు. స్టార్ హీరోలెవరైనా సరే? తమలోని మాస్ కోణాన్ని బయటకు తీయాలంటే పూరి దగ్గరకు వెళ్లాల్సిందే అనే పరిస్థితిని సృష్టించారు. రవితేజను మాస్ మహారాజాగా మార్చడంలో, అల్లు అర్జున్‌ను -దేశముదురు-గా చూపించడంలో విజన్ స్పష్టంగా కనిపిస్తుంది. -అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి-, -శివమణి-, -చిరుత-, -టెంపర్- , -ఇస్మార్ట్ శంకర్- ఇలా ఎన్నో విజయాలు పూరి చూసాడు. -బిజినెస్ మ్యాన్- చిత్రం పూరికి జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన గౌరవాన్ని, గుర్తింపును తెచ్చి పెట్టాయి. పూరి ట్యాలెంట్ చూసే బిగ్ బీ అమితాచ్చన్ సైతం ఓ అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే.ఏ క్రియేటర్ జీవితంలోనైనా ఎత్తుపల్లాలు సహజం. పూరి జగన్నాథ్ కూడా వరుస అపజయాలను ఎదుర్కొన్నారు. ఒక దశలో ఆయన తీసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు.

కథల విషయంలో మొరటుతనం పెరిగిందనే విమర్శలు ఎదుర్కున్నారు. భారీ అంచనాలతో వచ్చిన -ఆంధ్రావాలా-, -పైసా వసూల్-, -లైగర్- సహా పలు సినిమాలు డిజాస్టర్‌గా నిలవడం పూరి కెరీర్‌ను కొంత ఇబ్బందుల్లో నెట్టింది. కానీ ఓటమిని అంగీకరిస్తూనే మళ్ళీ పుంజుకోవడం పూరి శైలి. పూరి జగన్నాథ్ దర్శకుడే కాదు. మంచి ఫిలాసఫర్ కూడా. ఆయన సినిమాల్లోని పాత్రలు సమాజానికి భిన్నంగా ఆలోచిస్తాయి. -పూరి మ్యూసింగ్స్- పేరుతో ఆయన పంచుకునే ఆలోచనలు నేటి యువతను బాగా ఆకర్షిస్తున్నాయి. జీవితాన్ని, విజయాన్ని, అపజయాన్ని సమానంగా స్వీకరించే ఆయన వ్యక్తిత్వం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది.

## 'రాకా' మ్యూజిక్‌కు వరల్డ్‌వైడ్ క్రేజ్.. సాయి అభ్యంకర్ క్లారిటీ!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ సినిమా మ్యూజిక్ గురించి సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఇచ్చిన అప్‌డేట్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. ఇంటర్నేషనల్ లెవల్‌లో సాంగ్స్ ఉండబోతున్నాయని, విదేశీ సింగర్స్ కూడా ఇందులో భాగం అవుతున్నారని ఆయన చెప్పడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. బన్నీ స్టైల్‌కు తగ్గట్టుగా మ్యూజిక్ అదిరిపోబోతోందని క్లారిటీ వచ్చేసింది. ఆ వివరాలు ఇలా వున్నాయి.. సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఈ సినిమా మ్యూజిక్ వర్క్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అట్లీతో జరిగిన మొదటి మీటింగ్‌లోనే సాంగ్స్ ఎలా ఉండాలో ఆయనకు ఒక క్లియర్ విజన్ ఉందని సాయి తెలిపారు. ఇక అల్లు అర్జున్ మ్యూజిక్ టేస్ట్ గురించి మనందరికీ తెలిసిందే. బన్నీకి సంగీతంపై ఉన్న పట్టు, ఆయన ఇష్టాఇష్టాలు ఈ సినిమా ఆల్బమ్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్తున్నాయని సాయి చెప్పారు. వీరిద్దరి అభిరుచికి తగ్గట్టుగా సాంగ్స్ చాలా పవర్‌ఫుల్‌గా వస్తున్నాయని సమాచారం.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma